సాక్షి ములుగు

శుక్రవారం | 17 | మార్చి | 2023



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు.

- 8లో ▸



అధికారులు వర్సెస్ వ్యాపారులు

ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/20^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



ఏటూరునాగారం: మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని నాబార్డు బ్యాంక్ కోఆర్డినేటర్ రవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు గురువారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంక్ లింకేజీలను తీసుకొని రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. మహిళా సంఘాలకు వివిధ యాక్టివిటీస్ చేయడానికి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించే అవకాశం ఉందన్నారు. సబ్బులు, కొవ్వొత్తులు, న్యాపికిన్, అగర బత్తులు, చిల్లి పౌడర్, రైస్ మిల్లు వంటి పరిశ్రమలను నెలకొల్పుకునేందుకు తాము సహకరిస్తామన్నారు. అనంతరం బ్యాంక్ లింకేజీ డీపీఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చిన్న చిన్న ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. పసుపు కొమ్ములు పట్టి నాణ్యమైన పసుపు, కారం, పిండి వంటలు తయారు చేసి ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్నారు. డీపీఎం హెచ్ఆర్ భారతి, ఏపీడీ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత, ఏపీఎం పాషా, సీసీలు, వీఓఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 4న 'చలో హైదరాబాద్'

భూపాలపల్లి రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఏప్రిల్ 4న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ కరపత్రాలను విజయ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి, మోలుగురి రవీందర్, నాయకులు కాల్వ రాజేందర్, గురుకుంట్ల శ్రీనివాస్, మామిడి రవి, భిక్షపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



చిట్యాల: మహిళా శిశు సంక్షేమ జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన శైలజ మొదటిసారి చల్లగరిగె గ్రామంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీచేశారు. పిల్లల హాజరు శాతం పెంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే విధంగా చూడాలని అంగన్‌వాడీ టీచర్స్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమెను అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అంగన్‌వాడీ పిల్లలతో కలిసి పూల బొకెలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.

బహిరంగ మార్కెట్‌లో సర్కారు మందులు

భూపాలపల్లి అర్బన్/మహాముత్తారం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ప్రజలకు అందాల్సిన మందులు బహిరంగ మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. వీటిని కొందరు ఆర్ఎంపీలు బహిరంగంగానే రోగులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మహాముత్తారం మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన ఉడత రవి కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడ్డాడు. మూడు రోజుల నుంచి గ్రామానికి చెందిన ఒక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం పరీక్షించిన ఆర్ఎంపీ మందులు ఇచ్చాడు. సదరు వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి పక్క వారిని మందుల గురించి అడగగా.. వారు మందులను పరిశీలించడంతో అందులో కొన్ని ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన మందులు ఉన్నాయి. వాటిపై నాట్ ఫర్ సేల్ అని రాసి ఉంది. రోగి ఆర్ఎంపీని అడగ్గా తనకు వేరే వ్యక్తులు విక్రయించారని.. అందుకే డబ్బులు తీసుకున్నానని తెలిపాడు. దీంతో రోగి మండల వైద్యాధికారికి సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ విషయమై మండల వైద్యాధికారి సందీప్‌ను వివరణ కోరగా మండలంలోని మీనాజీపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు కూడా సమాచారం అందించాడని చెప్పారు. మందులను వాట్సాప్ చేశాడని ఈ విషయమై డీఎంహెచ్ఓకు సమాచారం అందించినట్లు తెలిపారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న కొందరు ఆస్పత్రికి వచ్చిన మందులను మాయం చేసి బయటి ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీలకు విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మిర్చి తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు



భయం..భయం

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

- పొట్ట దశలో ఉన్న వరి
- కల్లాల్లోని మిర్చిని టార్పాలిన్లు కప్పి రక్షించుకున్న అన్నదాతలు

ములుగు రూరల్/మంగపేట: ఆకాశంలో మబ్బులు.. మరో పక్క వర్షం పడడంతో రైతుల్లో భయం నెలకొంది. యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పొట్టదశలో ఉండటం, మిర్చి కల్లాల్లో ఆరబోసి ఉండడంతో అన్నదాతలు ఆగమాగం అయ్యారు. చిరు జల్లులు కురవడం మొదలుకాగానే వెళ్లి మిర్చి పంటపై టార్పాలిన్లు కప్పి పంటను రక్షించుకున్నారు. మరో నాలుగు రోజుల పాటు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికతో అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు.

దుంపిల్లగూడెం, కర్లపల్లిలో వడగండ్ల వాన

గోవిందరావుపేట మండలంలో గురువారం రెండు గంటల పాటు వర్షం కురిసింది. దుంపిల్లగూడెం, కర్లపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షం పడింది. వరి పంటలు పొట్టదశలో ఉండడంతో పంటలకు వర్షం వల్ల నష్టం వాటిల్లె ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పస్రాలో కురిసిన వర్షానికి పలు కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపైకి నీరు వచ్చి చేరింది.



ఆరబోసిన మిర్చిని కుప్ప చేస్తున్న కూలీలు

మిర్చి రైతుల పరుగులు

మండల పరిధిలోని గోదావరిలో మిర్చి ఆరబోసిన రైతులు టార్పాలిన్లు పట్టుకుని పరుగులు పెట్టారు. మధ్యాహ్నం 12.30గంటల వరకు తీవ్రమైన ఎండ ఉండగా కొద్ది సమయంలోనే ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై చిరు జల్లులు పడ్డాయి. ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి కల్లాల్లో ఉండడంతో టార్పాలిన్లు పట్టుకుని రైతులు పరుగున వెళ్లి పంటపై కప్పారు. గతంలో గోదావరి, వాగు ఇసుకలో ఆరబెట్టిన మిర్చి అకస్మాతుగా కురిసిన వర్షానికి వరదలు వచ్చి కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో గోదావరి, వాగుల్లో ఆరబెట్టిన రైతులు ఎక్కడ భారీ వర్షాలు కురుస్తాయో అనే ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం మబ్బులు తేలిపోయి వర్షం నిలవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



పస్రాలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

ఐటీడీఏ పీఓ అంకిత్

వెంకటాపురం(ఎం): విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల పరిధిలోని బూర్గుపేట్ గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర)ను ఆయన గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. మొత్తం ఉపాధ్యాయులు, విద్యార్థుల వాస్తవ హాజరుపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడి ఫలితాల షీట్‌ను తనిఖీ చేశారు. స్లిప్ పరీక్షలు, ప్రీ ఫైనల్-1 పరీక్షల ఆధారంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎక్కువ సంఖ్యలో స్టడీ అవర్‌ను పెంచాలని, మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు రేఖాచిత్రాలు, కోణాలు, ఫార్ములాలను అభ్యసిస్తున్నప్పుడు కనీస మార్కుల స్కోరింగ్‌పై ఈ- నమూనాను వివరించాలన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో మెనూ అమలు, రుచికరమైన ఆహారం, తాగునీటి సౌకర్యాలు మొదలైన వాటిపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించారు, జీసీసీ సరఫరాలు, బియ్యం నాణ్యత, ఆహార పదార్థాల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆహార నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు మాత్రమే అందించాలన్నారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ పనితీరును, ట్యాంక్‌ను సక్రమంగా శుభ్రపర్చాలన్నారు. క్యాంపస్‌ని పరిశీలించి, వంటలో ఉపయోగించేందుకు కూరగాయల సాగుకు కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ స్టడీ మెటీరియల్, వాచీలు, స్కూల్ బ్యాగులు, ప్రత్యేక పోషకాహారం అందించడం మొదలైన వాటిపై ఆరా తీశారు. 8, 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్ పూర్తిపై ఆరా తీశారు. విద్యార్థులు పుస్తకాలు చదివేటప్పుడు నేర్చుకునే సామర్థ్యాన్ని గమనించారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఆధార్‌కార్డు అప్‌డేట్ తప్పనిసరి

వాజేడు: ప్రతిఒక్కరూ ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, డీఎం విజయ్, వాజేడు తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 కంటే ముందు ఆధార్ నమోదు చేసుకున్న వారు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతీ 10 సంవత్సరాలకు ఒకసారి అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వారి వెంట ఆర్ఐ కె.రాజు, మీ సేవ నిర్వాహకుడు సర్వేష్ ఉన్నారు.

రాచపల్లిలో అప్‌డేట్ కేంద్రం పరిశీలన

వెంకటాపురం(కె): మండల పరిధిలోని రాచపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని మీ సేవ జిల్లా అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను జిల్లా మేనేజర్ దేవేందర్ వివరించారు. రాచపల్లి పంచాయతీలో ఇప్పటి వరకు 355 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకున్నారని తెలిపారు. పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, డీఎం విజయ్ , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్థానికులకు సూచనలు చేస్తున్న అధికారులు

సెకండియర్ పరీక్షలు ప్రారంభం



ఏటూరునాగారం:పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

ములుగు/ఏటూరునాగారం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 10 సెంటర్లలో జనరల్, ఒకేషనల్ విభాగంలో 1,863 మంది విద్యార్థులకు గాను 1,809 మంది హాజరైనట్లు డీఈఐఓ వెంకటేశ్వర్లు తెలిపారు. 54 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. 97.10 హాజరుశాతం నమోదు అయ్యిందని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని వివరించారు.

15 నిమిషాల ఆలస్యం

ఏటూరునాగారం మండల కేంద్రంలోని గురుకుల బాలికల కళాశాలలోని సెకండియర్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయడానికి దాసరి సత్యనారాయణ 15 నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ఒక నిమిషం దాటితే లోపలికి అనుమతి లేదని అధికారులు వెల్లడించారు. దీంతో పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు. మండల పరిధిలోని శివాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణకు సరైన రవాణా సౌకర్యం లేక సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోలేక పరీక్షను కోల్పోయాడు.



పరీక్షకు ఆలస్యంగా వచ్చిన సత్యనారాయణ

తాగునీటి సమస్యపై ఆగ్రహం

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించాలి
- జెడ్పీ వైస్‌చైర్ పర్సన్ బడే నాగజ్యోతి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ములుగు: జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నాగజ్యోతి అధ్యక్షతన జరుగగా ఆయా శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల్లోని కొన్ని గ్రామాల్లో, తాగునీరు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. మిషన్ భగీరథ అధికారుల తీరుపై మండిపడ్డారు. గడపగడపకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథను తీసుకొస్తే కొంతమంది నిర్లక్ష్యంతో చెడ్డపేరు వస్తుందని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగజ్యోతి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఏర్పడితే సహించేది లేదని హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖ తరఫున డీఎంహెచ్ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య హాజరై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమంపై వివరించారు. అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లు, కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణ తీరు, టీబీ, కుటుంబ నియంత్రణ వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యవసాయం తరఫున డీఏఓ గౌస్ హైదర్ హాజరై జిల్లాలోని ప్రగతి నివేదికను, రైతుబంధు పథకం ద్వారా అర్హులకు అందుతున్న సహాయం వివరాలను వెల్లడించారు. యాసంగిలో రైతులకు సరిపడా ఫర్టిలైజర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యాశాఖ తరఫున అకాడమిక్ మానిటరింగ్ అధికారి బద్దం సుదర్శన్ రెడ్డి హాజరు కాగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని జెడ్పీ వైస్‌చైర్ పర్సన్ సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థుల్లో ధైర్యం నింపాలన్నారు. మన ఊరు- మన బడిలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సభా సభ్యులు ప్రశ్నించగా మంజూరైన పనులు, పూర్తి చేసిన పనులపై సమాధానం ఇచ్చారు. అదే విధంగా విద్యుత్ శాఖ, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ విభాగం తరఫున చేపడుతున్న పనుల పురోగతి వివరాలను జెడ్పీ చైర్‌పర్సన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, జెడ్పీటీసీలు రుద్రమదేవి, పాయం రమణ, తల్లాడి పుష్పలత, కరంచంద్ గాంధీ, కో ఆప్షన్ సభ్యులు వలియాబీ, రియాజ్ మిర్జా, ఎంపీపీలు గండ్రకోట శ్రీదేవిసుధీర్, బుర్ర రజిత, వాణిశ్రీ , డీపీఓ కొండా వెంకయ్య, ఎక్సైజ్ సీఐ సుధీర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగజ్యోతి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో బూత్ కమిటీల్లో శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లను 10 రోజుల్లో నియమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల వారీగా బూత్ కమిటీలు ప్రతీ ఇంటికి కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కృష్ణగౌడ్, రమేష్, భూక్య రాజునాయక్, జవహర్ లాల్, ఉత్తమ్‌కుమార్, భిక్షపతి, రవీందర్, వాసుదేవరెడ్డి, సురేష్, పరమేశ్వర్, యాకూబ్ పాషా, జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులను శిక్షించాలి

ములుగు రూరల్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు రత్నం ప్రవీణ్, తోకల రవిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లకు వెళ్లి చదువుకుంటే టీఎస్‌పీఎస్‌సీ అధికారుల నిర్లక్ష్యంతో పేపర్ లీకేజీ అయి నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లీకేజీలతో సంబంధం ఉన్న రేణుక, ప్రవీణ్‌లను కఠినంగా శిక్షించాలన్నారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని వెంటనే తొలగించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలువల రవీందర్, సునీల్, శంకర్, రవితేజ, బాలేశ్వర్, సుమంత్, శివకేశవ్, రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విద్యార్థులకు 'పది' కీలకం

ములుగు: విద్యార్థి దశలో 10వ తరగతి ఎంతో కీలకమైందని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కలెక్టర్ కృష్ణ ఆదిత్య గురువారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పరీక్షలంటే భయం వీడి శ్రద్ధగా, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇప్పుడు చదివి సాధించే ఫలితాలు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని వివరించారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు స్నేహభావంగా మెలగాలని, వారిలో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో రోజు వారీగా పరిశుభ్రమైన ఆహారం, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. హెచ్ఎంలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నిరంతర విద్యుత్, వైద్య సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు కేంద్రాలను తనిఖీ చేసి సలహాలు, సూచనలు చేయాలని ఆదేశించారు.

బీజేవైఎం నాయకులను జైలుకు పంపడం సరికాదు



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలపై భారతీయ జనతా యువమోర్చ ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో నిరంకుశపాలన కొనసాగుతుందన్నారు. నిరుద్యోగుల పక్షాన నిరసన తెలిపిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్‌ను 14 రోజులు రిమాండ్‌కు తరలించడం, అక్రమ కేసులు బనాయించడం దొరలపాలనకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, విద్యాశాఖ మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, భూక్య రాజునాయక్, భూక్య జవహర్‌లాల్, భిక్షపతి, రవీంద్రాచారి, ఉత్తమ్‌కుమార్, సురేష్, పరమేశ్వర్, మద్దినేని తేజరాజు, సత్యం, శ్రీనివాస్, మునిందర్, రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయమే బతికిస్తుంది..

స్తంభాలవారీగా తనిఖీలు చేపట్టాలి

19న స్కాలర్‌షిప్ ఎంపికలు

- 10లో ▸

భూ తగాదా కేసులో ఒకరి రిమాండ్

నర్సంపేట రూరల్: భూ తగాదా కేసులో ఒకరు రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని నాడెం వీరస్వామి మాధన్నపేట పెద్ద కాల్వ సమీపంలో 20 గుంటల భూమి ఉంది. 2018లో అతని కూతురు వివాహం నిమిత్తం ఆ భూమిని నర్సంపేట మండలంలోని ఏనుగల్‌తండాకు చెందిన అనిల్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. అప్పట్లో రెండు సంవత్సరాలపాటు వీరస్వామి కౌలు చేశాడు. ఈ క్రమంలో నా భూమి హద్దులు మార్చారంటూ అనిల్ పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో అనిల్ పది రోజుల క్రితం నాడెం వీరస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదు చేశారు. సీపీ రంగనాథ్‌ను ఆదేశాల మేరకు ఈనెల 9న డీసీపీ కర్ణాకర్, నర్సంపేట ఏసీపీ సంపత్‌రావులు ఆ భూమిని పరిశీలించారు. ఈ క్రమంలో వీరస్వామి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

కరీమాబాద్‌లో..

ఖిలా వరంగల్: భూ ఆక్రమణకు యత్నించడమే కాకుండా ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చెందిన దేవర శ్రీనివాస్, రాజేశ్వరి దంపతులు 38 గజాల ఇంటి స్థలాన్ని రూ.5 లక్షలకు పల్లకొండ రమేష్‌కు విక్రయించేందుకు 2021 సెప్టెంబర్ 29న అగ్రిమెంట్ చేసుకున్నారు. రమేష్ నుంచి రూ.1 లక్ష అడ్వాన్స్‌గా తీసుకున్నారు. రెండేళ్ల దాటినా రమేష్ డబ్బులు ఇవ్వకపోగా ఆ స్థలానికి ప్రహరీ నిర్మాణానికి యత్నించాడు. శ్రీనివాస్ అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే నిర్మాణం చేపట్టాలని నిలదీశారు. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్‌తో పాటు కురాకుల కల్యాణ్, రాయపురం రంజిత్‌లు కలిసి శ్రీనివాస్‌పై కర్రలు, ఇటుక పెళ్లలతో దాడి చేశారు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఐదుగురి అరెస్ట్

ప్రైవేట్ వ్యక్తుల భూమిలో జెండాలు పాతి గుడిసెలు వేసేందుకు యత్నించిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.



అధికారులు వర్సెస్ మిర్చి వ్యాపారులు

- కమీషన్ లేకుండా కొనుగోలు చేయాలంటున్న అధికారులు
- కుదరదంటున్న వ్యాపారులు
- టెండర్ల ఆలస్యంతో రైతుల పడిగాపులు
- కమీషన్‌తో నష్టపోతున్నామంటూ కర్షకుల ఆవేదన



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు నిలిచిపోవడంతో పడిగాపులు పడుతున్న రైతులు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఒక పక్క తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి పడిపోగా, మరో వైపు కమీషన్ పేరా డబ్బులను కటింగ్ చేస్తూ తూకంలో గ్రాముకు లెక్కకట్టకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. వివరాలిలా ఉన్నాయి.. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నామ్ విధానం కింద కొనుగోలు చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం మార్కెట్‌లో మిర్చి ఖరీదును ప్రారంభించారు. ఆ సమయంలో 3 శాతం కమీషన్‌తోపాటు, గ్రాముల లెక్కకట్టకుండా కొనుగోలు చేసేందుకు రైతు సంఘం, వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాని ప్రస్తుతం ఆ గడువు ముగిసినందున ఎలాంటి కమీషన్ లేకుండా తూకంలో గ్రాముల లెక్కతోపాటు, బస్తాకు ఖరీదు కట్టివ్వాలని, ఖరీదు చేసిన రోజునే డబ్బులు చెల్లించాలంటూ పలు రైతు సంఘాల నాయకులు మార్కెట్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చారు. ఈ మేరకు ఇటీవల వ్యాపారులతో, రైతు సంఘం నాయకులతో మార్కెట్ అధికారులు చర్చలు జరిపారు. మార్కెట్‌లో నిబంధనల ప్రకారం కమీషన్ లేకుండా, తూకంలో గ్రాములకు లెక్కకట్టి డబ్బులు చెల్లించాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మార్కెట్‌కు మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా, అధికారులు చెప్పినట్లుగా తాము ఖరీదు చేయలేమంటూ వ్యాపారులు చేతులెత్తేశారు. దీంతో మధ్యాహ్నం దాటినప్పటికీ వ్యాపారులు ఖరీదుకు రాకపోవడంతో రైతులు మిర్చి యార్డులో రైతులు పడిగాపులు పడ్డారు. చివరకు రైతులు ఆగ్రహానికి గురై అధికారులను నిలదీశారు.

పాతపద్ధతిలోనే కొనుగోలు..

పాతపద్ధతిలోనే మిర్చి ఖరీదు చేస్తామని వ్యాపారులు చెబుతుండగా మరోవైపు ఈ–నామ్ విధానం కింద ఎలాంటి కమీషన్‌లు లేకుండానే కొనుగోలు చేయాలని, లేకుంటే ఖరీదుకు అంగీకరించమని మార్కెట్ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో మరోమారు చర్చలు జరిగిన తర్వాత తమ నిర్ణయాన్ని చెబుతామంటూ వ్యాపారులు తెలిపారు. ఈ నెల 20 నుంచి కమీషన్ లేకుండా, గ్రాములను సైతం లెక్కకట్టి మిర్చిని ఖరీదు చేయాలని స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మార్కెట్‌కు 723 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.23,421లు, కనిష్ట ధర రూ.17,055లు పలికింది. తాలు రకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.14,211లు, కనిష్ట ధర రూ.13,911లు పలికినట్లు అధికారులు తెలిపారు.

కమీషన్‌తో నష్టపోతున్నాం..



ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాను. రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. పంటకు తెగుళ్ల సోకడంతో కేవలం 4 క్వింటాళ్ల మిర్చినే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో కమీషన్ లేకుండా కొనమంటూ వ్యాపారులు ఖరీదు చేయడానికి రాలేదు. చివరకు మళ్లీ పాత పద్ధతిలోనే కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టపోయాం.

-మొగిలి, అర్పనపల్లి, కేసముద్రం మండలం

పాత పద్ధతితోనే కొనుగోలు చేస్తాం..



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ప్రారంభించే సమయంలో 3 శాతం కమీషన్‌తో, తూకంలో 500 గ్రాములకే లెక్కకట్టి ఖరీదు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. పాత పద్ధతితోనే మిర్చిని కొనుగోలు చేస్తున్నాం. ఇతర మార్కెట్‌ల్లో మాదిరిగానే తాము ఇక్కడ మిర్చిని ఖరీదు చేస్తున్నాం.

-తోకల శ్రీనివాస్‌రెడ్డి, మిర్చి వ్యాపారి

కమీషన్ లేకుండానే ఖరీదు చేయిస్తాం..



మార్కెట్‌లో ఎలాంటి కమీషన్ లేకుండా, గ్రాములను లెక్కకట్టే విధంగా మిర్చిని ఖరీదు చేయిస్తాం. కొనుగోలు చేసిన రోజునే చెక్కులను ఇచ్చేలా చూస్తాం. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

-అమర లింగేశ్వర్‌రావు, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ కేసముద్రం మార్కెట్

రైలునుంచి జారి పడి మహిళ మృతి

శాయంపేట: రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన సంఘటన చర్లపల్లి స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శాయంపేట మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి పుష్‌పుల్ రైలులో చర్లపల్లికి వెళ్తున్నారు. రైలు దిగుతున్న క్రమంలో ప్రభాకర్ భార్య సంధ్య కిందపడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంధ్యను కాపాడే ప్రయత్నంలో ప్రభాకర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంధ్య మృతితో శాయంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..



మృతి చెందిన సుధాకర్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని బాంబుల గడ్డ ప్రధాన రాహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కొమ్మ సుధాకర్ (30) జిల్లా కేంద్రంలోని బొగ్గు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో బాంబులగడ్డ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఆటో డ్రైవర్లు, ఉన్నతాధికారులతో గురువారం ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆటో డ్రైవర్లకు గౌరవం దక్కిందన్నారు. ఆటో డ్రైవర్ల కోసం త్రిచక్ర ఆటో డ్రైవర్స్ పొదుపు, పరపతి సహకార సంఘాన్ని ఏర్పాటు చేయించానని, ప్రస్తుతం రూ.1.50 కోట్ల టర్నోవర్‌తో సహకార సంఘం నడుస్తోందని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై చలాన్ల విధింపును పరిమితం చేస్తామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఆటో డ్రైవర్ల భవనానికి స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ నగరంలో మూడు ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మే 1 న డీసీసీబీ ఆధ్వర్యంలో 100 ఆటోలకు రుణ సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. త్రిచక్ర ఆటో డ్రైవర్స్ పొదుపు, సహకార సంఘం కో ఆర్డినేటర్ ఎన్. రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీఓలు వేణు, ఆఫ్రీన్, ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం జాస్తి శ్రీలత, కార్మిక శాఖ సహాయక కమిషనర్ కోలా ప్రసాద్, ఆర్డీఓ వాసుచంద్ర, కల్పలత సూపర్ బజార్ చైర్మన్ వర్ధమాన్ జనార్దన్, ఎండీ ఎ.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



పాల్గొన్న ఆటో డ్రైవర్లు

యువకుడి ఇంటి ఎదుట మహిళ నిరసన

ధర్మసాగర్(వేలేరు): భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళను ఓ యువకుడు మాయమాటలు చెప్పి లోబర్చుకొని, ఆమె వద్ద నుంచి సుమారు రూ.15లక్షలు తీసుకుని మొహం చాటేశాడని బాధిత మహిళ నిరసన చేపట్టింది. ఈ ఘటన గురువారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ముత్తోజు అజయ్ అనే యువకుడు నాలుగు సంవత్సరాల క్రితం తనకు పరిచయమై మాయమాటలు చెప్పి తనను కొత్తకొండ దేవాలయంలో రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి మేమిద్దరం కలిసే ఉంటున్నాం. రూ.15లక్షలతో సొంతంగా ఇళ్లు కూడా నిర్మించుకున్నాం. అజయ్ తన చెల్లి పెళ్లి చేసిన తర్వాత తనను ఇంటికి తీసుకెళ్లి కలిసే ఉంటామని నమ్మించాడు. ప్రస్తుతం ఐదు నెలలుగా తనతో కలిసి ఉండటం లేదని, పది రోజుల క్రితం ఎర్రబెల్లి గ్రామానికి వస్తే తనను అజయ్ తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఈనెల 19న సర్పంచ్, పెద్ద మనుషుల ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించుకుంటామని అజయ్ తెలిపినట్లు ఆమె తెలిపింది. నాలుగు రోజులుగా సైదాపూర్‌లోని తన ఇంటి వద్దకు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపింది. దీంతో ఆయన వేధింపులు భరించలేక గురువారం ఎర్రబెల్లిలోని అజయ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మహిళను అక్కడి నుంచి పంపించారు.



యువకుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళ

వీధికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

- భయాందోళనలో గ్రామస్తులు



కుక్కకాటుకు గురైన కార్తీక్ కాలు భాగం

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని 3 గ్రామాల్లో గురువారం ఒకేరోజు ముగ్గురిని వీధి కుక్కలు కాటేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కోట్యానాయక్‌తండాకు చెందిన గుగులోత్ కార్తీక్ (6) ఆడుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన కుక్క.. పలుచోట్ల కరవడంతో 3 చోట్ల కాట్లు పడ్డాయి. పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వృద్ధురాలు గుగులోత్ భద్రిని కుక్క కాటు వేసింది. ముల్కనూరుకు చెందిన 5 ఏళ్ల బాలుడు బెల్లం దివ్యక్ చక్రవర్తిని వీధి కుక్కలు దాడిచేసి కరిచాయి. వీరందరూ స్థానిక సీహెచ్‌సీలో కుక్కకాటు వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ హనుమంతరావు తెలిపారు. గ్రామాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోతుల దాడిలో విద్యార్థికి..



గాయపడిన విద్యార్థి కృతిమ్

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని పాలంపేట గ్రామంలో గురువారం దేవులపల్లి కృతిమ్(8) అనే బాలుడిపై కోతులు దాడి చేసి గాయపర్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక పూట బడులు కావడంతో దేవులపల్లి రమేష్ – శైలజ దంపతుల కుమారుడు కృతిమ్ గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోతులు దాడి చేసి గాయ పర్చాయి. గమనించిన తోటి విద్యార్థులు కృతిమ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అతడిని కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, అధికారులు స్పందించి కోతులను పట్టి అడవిలో వదిలి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ తొర్రూరు బ్రాంచీ కార్యాలయంలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ను చైర్మన్ మార్నేని రవీందర్ రావు అందజేశారు. గురువారం హనుమకొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తొర్రూరు డీసీసీబీ బ్రాంచీలో పని చేస్తున్న ఉద్యోగి జితేందర్ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయనకు వెళ్లాల్సిన బెనిఫిట్స్ రూ.6,17,000 విలువ కలిగిన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిన్నారావు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వృద్ధుడు మృతి



రాజేశం (ఫైల్)

హసన్‌పర్తి: చెరువులో ఈత కొట్టడానికి తాత మనవళ్లు వెళ్లగా.. ప్రమాదవశాత్తు తాత ఈత కొడుతూ మునిగి పోయాడు. ఈ ఘటన గురువారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేయూ–1 ప్రాంతానికి చెందిన యాంసాని రాజేశం (72) బుధవారం తన మనవడు అక్షిత్‌తో కలిసి రెడ్డిపురం సమీపంలోని ఓ చెరువులో ఈతకు వెళ్లారు. అక్షిత్ ఒడ్డుకు ఉండగా రాజేశం చెరువులో ఈత కొడుతూ కనిపించకుండా పోయాడు. గమనించిన అక్షిత్ డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈత గాళ్ల సాయంతో గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం రాజేశం మృతదేహం చెరువులో తేలుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధి సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ శివారులోని ఊరకుంటలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి జారి పడి మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడెంకు చెందిన దుగ్గినేని మురళి (47) గురువారం గ్రామ సమీపంలోని ఊరకుంటలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మురళి ఈతకు వెళ్లి మృతి చెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టవర్ పైనుంచి పడి వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ హైటెన్షన్ టవర్ పైనుంచి ప్రమాదవశాత్తు పడి అంజాద్ అలీ (22) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన అంజాద్‌అలీ, అతని తండ్రి జియాహుల్ హక్‌తో పాటు మరికొందరు మండలంలోని పాంనూర్‌లో విద్యుత్ హైటెన్షన్ లైన్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పనులు చేస్తున్న క్రమంలో హైటెన్షన్ టవర్‌పై నుంచి ప్రమాదవశాత్తు అంజాద్‌అలీ జారి పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి..



ఆంజనేయులు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చిగురు సరిత భర్త, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చిగురు ఆంజనేయులు (46) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లిలో ఓ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో ఒంటిలో కాస్త నలతగా ఉందని ఇంటికి వెళ్లాడు. ఇంట్లోకి వెళ్లే క్రమంలో గడప కాలికి తగిలి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన ఆంజనేయులు కుమార్తె తల్లికి సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య ఆంజనేయులు ఇంటికి చేరుకుని చెతస్కోప్‌తో పరీక్షించారు. ఎమ్మెల్యే వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

హరిభూషణ్ పేరుతో పైసలు వసూల్

- ముగ్గురు మాజీలతో పాటు మరో వ్యక్తి అరెస్ట్
- రూ.1.20 లక్షల నగదు, ఎయిర్‌పిస్టల్, నాలుగు సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు

బయ్యారం: మావోయిస్ట్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిభూషణ్ పేరుతో బలవంతపు వసూళ్లు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన దళ కమాండర్ ముత్తయ్య అలియాస్ ఆజాద్, బయ్యారం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ పసుల లింగయ్య అలియాస్ లింగన్న, ఖమ్మం పట్టణం బల్లేపల్లికి చెందిన బత్తుల రామకృష్ణ, బయ్యారానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన ఆర్గనైజర్ నిమ్మల లింగయ్యలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. బయ్యారం మండలంలో గతంలో నక్సల్స్ కార్యకలాపాలు కొనసాగడాన్ని ఆసరాగా చేసుకున్న వీరు అమాయకులను టార్గెట్‌గా చేసుకొని వసూళ్లకు తెరలేపారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇల్లందు నుంచి కొత్తపేటలోని తన వ్యవసాయభూమి వద్దకు వచ్చిన వ్యాపారి యాదగిరిరెడ్డిని ఎయిర్‌గన్‌తో బెదిరించి మాజీ మావోయిస్ట్ హరిభూషణ్ పంపించారని రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. అతను డబ్బులు ఇవ్వకపోవటంతో కిడ్నాప్ చేశారు. తరువాత రూ.1.20 లక్షలు ఇవ్వగా విడుదల చేశారు. ఈక్రమంలో బయ్యారంలో సీసీఎస్, స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మావోయిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ రమణబాబు తెలిపారు. బయ్యారం మండలంలో మావోయిస్టులు, ఇతర నక్సల్స్ కార్యకలాపాలు లేవని, నక్సల్స్ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. నకిలీ నక్సలైట్లను పట్టుకున్న సీసీఎస్ సీఐ మోహన్, గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, సీసీఎస్ ఎస్‌ఐ రామారావు, బయ్యారం ఎస్‌ఐ రమాదేవి, సీసీఎస్ ఏఎస్‌ఐ పాపయ్య, కానిస్టేబుల్స్ రాజశేఖర్, విజయ్, బాలు, సుమన్, హోంగార్డు మధుసూదన్‌రెడ్డిలను అభినందించి రివార్డులు అందజేశారు.



నకిలీ మావోయిస్టులను చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, చిత్రంలో పోలీస్ అధికారులు